# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 153 | పేజీలు : 08 | గురువారం | 11-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




మోదీయే ప్రధానిగా

## కొనసాగాలి

- 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి: బండి సంజయ్
- ప్రధానిగా నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టారన్న బండి సంజయ్
- అత్యధిక కాలం ప్రధానిగా మోదీ పేరు లిఖించబడిందని హర్షం
- మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని వ్యాఖ్య

2





# మనకు మాత్రమే కాదు ప్రపంచానికి కూడా

2

- ఫ్యూచర్‌సిటీ మనకు మాత్రమే కాదు - ప్రపంచానికి కూడా : సీఎం రేవంత్ రెడ్డి
- ఎఫ్‌సీడీఏ కార్యాలయం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఫ్యూచర్‌సిటీలో పాలన దిశగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ముందడుగు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్
రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు వేశామన్న సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పాలనను సమర్థవంతంగా, సాంకేతికంగా అందించేందుకు రెండెకరాల్లో నిర్మించిన భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ – ఎఫ్‌సీడీఏ కార్యాలయాన్ని రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ లోగో, పోర్టల్, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. ఫ్యూచర్ సీటీ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,



## పలికే అర్హత కూడా లేదు

2

- జగన్‌కు స్టీల్ ప్లాంట్ అనే పదం ని పలికే అర్హత కూడా లేదు: అనిత
- జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో అనిత విమర్శలు
- స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాలకు వాడుకోవాలని జగన్ భావించారని విమర్శ
- కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

హైదరాబాద్ పల్స్,అమరావతి
వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంశంపై గత ఐదేళ్లలో జగన్ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ

# ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కుట్ర

**మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై ఎంపీ చామల**

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించిన ఎన్నికల అధికారులు
- కుట్రపూరితంగా నామినేషన్ రిజెక్ట్ చేశారన్న చామల
- కాంగ్రెస్‌ను రేసు నుంచి తప్పించేందుకు ముందు నుంచే బీజేపీ స్కెచ్ వేసిందని విమర్శ

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్
మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై రాజకీయ రగడ ముదురుతోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక చిన్న ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని, కావాలనే

# అదే అసలైన పరీక్ష..



2

హైదరాబాద్ పల్స్,ఢిల్లీ
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో మరో అరుదైన మైలురాయిని అందుకున్నారు. దేశానికి సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా సేవలు అందించిన ఎన్నికైన ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును ఆయన అధిగమించారు. బుధవారం నాటికి ప్రధానిగా మోదీ పదవీకాలం 12 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు

**అలా పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారు: ప్రధాని మోదీ**

- సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ
- ఎన్నికైన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుని అరుదైన ఘనత
- ప్రజాసేవే సుపరిపాలనకు అసలైన పరీక్ష అని 'ఎక్స్'లో పేర్కొన్న ప్రధాని
- అంకితభావం, వినమ్రత, కర్తవ్య దీక్షతో పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారని వ్యాఖ్య
- మోదీ రికార్డుపై ఢిల్లీలో ఎన్డీఏ కూటమి ప్రత్యేక సమావేశం, వేడుకలు



## భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్

2 ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు
- 'మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్
- చర్చల విషయంలో జాప్యం చేస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు


## కుప్పకూలిన పాక్ ఆర్మీ హెలికాప్టర్..



2

- పీవోకేలో కుప్పకూలిన పాక్ ఆర్మీ హెలికాప్టర్.. ప్రయాణిస్తున్న వారంతా మృతి
- పీవోకేలో కుప్పకూలిన పాకిస్థాన్ ఆర్మీ హెలికాప్టర్
- సాంకేతిక లోపంతోనే ప్రమాదం జరిగిందని తెలిపిన పాక్ సైన్యం
- ప్రమాదంలో హెలికాప్టర్‌లోని సిబ్బంది అందరూ మృతి
- దాదాపు 21 మంది సైనికులు మరణించి ఉండవచ్చని ప్రాథమిక అంచనా

హైదరాబాద్ పల్స్,కశ్మీర్
పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో బుధవారం ఘోర ప్రమాదం సంభవించింది. ముజఫరాబాద్ సమీపంలో పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న సిబ్బంది అందరూ మరణించినట్లు పాక్ సైన్యం ధ్రువీకరించింది. పాకిస్థాన్ మిలిటరీ మీడియా విభాగం ఈ ఘటనపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. సాంకేతిక లోపం కారణంగానే ఈ



రాజీనామా చేయకపోతే

## ఆందోళనలు చేస్తాం

2

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం : సీజేపీ
- గురువారం పుణెలో శాంతియుత నిరసనలు
- అనంతరం లఖ్‌నవూ, అమృత్‌సర్, జైపూర్, బెంగళూరు నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు
- జూన్ 20న దేశ రాజధానిలో మరోసారి ఆందోళన చేస్తాం
- కాక్రోచ్ జనతా పార్టీ వెల్లడి

## అత్యాశ వదులుకుంటేనే..

**సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుంది : డీజీపీ సీవీ ఆనంద్**

- తెలంగాణలో నక్సలిజం పూర్తిగా పోయిందని డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటన
- మావోయిస్టుల ఏరివేత కోసం ఏర్పాటు చేసిన బలగాలను ఇతర సేవలకు వినియోగిస్తామని వెల్లడి
- పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆందోళన



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్
అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అదిలాబాద్ జిలాల్లో పర్యటించిన డీజీపీ, రాష్ట్రంలో మావోయిస్టుల స్థితి, లా అండ్ ఆర్డర్‌పై స్పందించారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు: పవన్ కల్యాణ్

హైదరాబాద్ పల్స్,అమరావతి
జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు.బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్

2





సీఎం రేవంత్‌కు

## ఓటమి తప్పదు

2 ఎంపీ అర్వింద్

హైదరాబాద్ పల్స్,భువనగిరి
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై

## ప్రైవేట్ కేసును
# అడ్డం పెట్టుకొని కుట్ర

**మొదటి పేజీ రువాయి**

కుట్రపూరితంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రిజెక్ట్ చేశారని ఆయన విమర్శించారు.బీఎన్ఎస్ (దీచీూ) యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదని... చట్టాలను తుంగలో తొక్కి బీజేపీ ఈ చర్యలకు పాల్పడుతోందని ఎంపీ స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలతో పాటు ఎన్నికల సంఘాన్ని కూడా అడ్డం పెట్టుకొని... బీజేపీ ఈ ఎన్నికలను తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని చామల ఆరోపించారు. "మధ్యప్రదేశ్‌లో బలబలాల ప్రకారం బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లు, కాంగ్రెస్‌కు ఒక సీటు వచ్చే అవకాశం ఉంది. అలాంటప్పుడు మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెట్టింది?" అని ఆయన ప్రశ్నించారు. దీన్ని బట్టే కాంగ్రెస్‌ను ఎలాగైనా రేసు నుంచి తప్పించాలని బీజేపీ ముందు నుంచే స్కెచ్ వేసిందని అర్థమవుతోందన్నారు.ఇదే తరుణంలో తెలంగాణ ప్రాంతీయ రాజకీయాలను ప్రస్తావిస్తూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు పన్నుతున్నాయని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఇక్కడి బీఆర్ఎస్ పార్టీ సమర్థిస్తుందా అని చామల నిలదీశారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారని, ఎప్పటికీ అధికారంలోకి రాలేరని ఆయన హెచ్చరించారు.

## మోదీయే ప్రధానిగా
# కొనసాగాలి

**మొదటి పేజీ రువాయి**

భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు."రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు

## రాజీనామా చేయకపోతే
# ఆందోళనలు చేస్తాం

**మొదటి పేజీ రువాయి**

జాతీయ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. గురువారం పుణెలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం లఖ్‌నవూ, అమృత్‌సర్, జైపూర్, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. అయితే, వచ్చే శనివారం నాటికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే జూన్ 20నుంచి దేశ రాజధానిలోని జంతర్? మంతర్? వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని అభిజీత్ తెలిపారు.

**యువత భారీ సంఖ్యలో తరలిరావాలి!**

ఈ ఆందోళనకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో తరలిరావాలని అభిజీత్ పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పత్రాన్ని తీసుకునేంతవరకు ఎవరూ కూడా దిల్లీ నుంచి వెనక్కి తిరిగే ప్రసక్తే లేదని, తాను స్వయంగా ఈ ఆందోళనను ముందుండి నడిపిస్తానని ప్రకటించారు. పరీక్ష నిర్వహణలో జరుగుతున్న లోపాలపై యువత ఎంతమాత్రం నిశ్శబ్దంగా ఉండేందుకు సిద్ధంగా లేరని ఆయన స్పష్టం చేశారు. నీట్ పరీక్ష వాయిదా పడటంతో విద్యార్థులు మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్‌తో పాటు సీబీఎస్ఈలో జరుగుతున్న అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత వహించేందుకు కేంద్రంలో ఎవరూ ముందుకు రావడం లేదని మండిపడ్డారు.

**పుణె నిరసన కార్యక్రమంలో సోనమ్ వాంగ్‌చుక్**

భవిష్యత్తులో వైద్యులుగా మారి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన విద్యార్థులే ఈ విద్యా వ్యవస్థ వల్ల ప్రాణాలను కోల్పోతున్నారని అభిజీత్ దిప్కే దుయ్యబట్టారు. భారత విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి, వ్యవస్థాగత వైఫల్యాల మూల్యాన్ని ఏ విద్యార్థీ చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా చూడటానికి చేపట్టిన ఉద్యమంగా దీన్ని అభివర్ణించారు. అయితే, గురువారం పుణెలో జరిగే నిరసన కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని దీప్కే తెలిపారు. గత శనివారం జంతర్ మంతర్ వద్ జరిగిన నిరసనల్లోనూ సోనమ్ పాల్గొన్నారు. అంతేకాదు, ఆ నిరసనల్లో భాగంగా అభిజీత్‌ను కానీ, సీజేపీ సభ్యులను కానీ పోలీసులు అరెస్టు చేస్తే, 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

# అదే అసలైన పరీక్ష..

**మొదటి పేజీ రువాయి**

పూర్తయిన వేళ సంబరాలు జరుపుకోవడానికి కూటమి సిద్ధమైంది.ఈ చారిత్రక ఘట్టంపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ప్రజలకు సేవ చేయడమే సుపరిపాలనకు అసలైన పరీక్ష. అంకితభావం, వినమ్రత, కర్తవ్య దీక్షతో నిరంతరం పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారు" అని ఆయన పేర్కొన్నారు.

నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ.. సుదీర్ఘకాల ప్రధానిగా కొత్త చరిత్ర ప్రధానిగా మోదీ నిరంతరాయంగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో ఈ రికార్డు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. దేశానికి తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన 1952 నుంచి నెహ్రూ పదవీకాలాన్ని ఈ పోలిక కోసం పరిగణనలోకి తీసుకున్నారు. అంతకుముందు 1947 నుంచి 1952 వరకు ఆయన తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేసినప్పటికీ, ఆమె పదవీకాలం నిరంతరాయంగా కొనసాగలేదు. దీంతో వరుసగా ఎన్నికై సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న వ్యక్తిగా మోదీ చరిత్ర సృష్టించారు. 2014లో తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 2019లో రెండోసారి, 2024లో చారిత్రాత్మకంగా మూడోసారి విజయం సాధించి అధికారంలో కొనసాగుతున్నారు.మోదీ నాయకత్వంలోని 12 ఏళ్ల పాలనలో కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా, కర్తవ్య పథ్, వందే భారత్ రైళ్లు, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ఐఎన్ఎస్ విక్రాంత్, కశ్మీర్ రైల్ లింక్, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం, నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి అనేక ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి.ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని నేడు ఢిల్లీలోని భారత్ మండపంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) కీలక సమావేశం నిర్వహిస్తోంది. ఈ వేడుకకు ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు, 22 ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, భాగస్వామ్య పక్షాల నేతలు హాజరుకానున్నారు. నెహ్రూ రికార్డును అధిగమించినందుకు ప్రధాని మోదీని అభినందిస్తూ ఎన్డీఏ ఈ సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు సమాచారం.

## కుప్పకూలిన పాక్
# ఆర్మీ హెలికాప్టర్..

**మొదటి పేజీ రువాయి**

ప్రమాదం జరిగిందని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పేర్కొంది. అయితే, మృతుల సంఖ్యను అధికారికంగా వెల్లడించలేదు. ప్రమాద వార్త అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు ఒక విచారణ కమిటీని నియమించినట్లు ఐఎస్‌పీఆర్ తెలిపింది.ప్రాథమిక నివేదికల ప్రకారం, ఈ ప్రమాదంలో సుమారు 21 మంది భద్రతా సిబ్బంది మరణించినట్లు తెలుస్తోంది. నీలం లోయ సెక్టార్‌కు అదనపు బలగాలను తరలిస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే హెలికాప్టర్ కూలిపోయిందని, ప్రమాద స్థలంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనపై పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ప్రస్తుతం ముజఫరాబాద్ ప్రాంతంలో నిరసనల కారణంగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, ఈ ప్రమాదానికి, స్థానిక ఆందోళనలకు ఎలాంటి సంబంధం లేదని సైన్యం స్పష్టం చేసింది. గతంలో 2025 సెప్టెంబర్‌లో గిల్గిత్-బల్టిస్థాన్ పరిధిలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఐదుగురు సైనికులు మృతి చెందారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు: పవన్ కల్యాణ్

**మొదటి పేజీ రువాయి**

మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు.కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

# మనకు మాత్రమే కాదు ప్రపంచానికి కూడా

**మొదటి పేజీ రువాయి**

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో కలిసి సీఎం పరిశీలించారు. ఫ్యూచర్‌సిటీలో పాలన దిశగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ముందడుగు వేయనుంది. అనంతరం ఆయన మాట్లాడారు.

ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదు - ప్రపంచానికే

బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములు విలువ ఎక్కువన్న సీఎం, కుతుబ్‌షాహీలు, నిజాంలు కృషి వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందిందని తెలిపారు. హైటెక్‌సిటీ అంటే నవ్విన వాళ్లు ఉన్నారని, విమానాశ్రయం, జీనోమ్‌వ్యాలీ, ఐటీ సంస్థలను ఆనాడు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఐటీ పరిశ్రమలు రాకుంటే ఈనాడు యువతకు ఉద్యోగాలు వచ్చేవా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోందని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదని, ప్రపంచానికి అని స్పష్టం చేశారు.

# పలికే అర్హత కూడా లేదు

**మొదటి పేజీ రువాయి**

ఘాటైన ఆరోపణలు చేశారు. అసలు జగన్‌మోహన్ రెడ్డికి "విశాఖ స్టీల్ ప్లాంట్" అనే పదం పలికే అర్హత కూడా లేదని హోంమంత్రి స్పష్టం చేశారు.వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాల కోసం వినియోగించుకోవాలని జగన్ భావించారని, ఈ విషయాన్ని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారే స్వయంగా వెల్లడించారని అనిత పేర్కొన్నారు. "స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు సంవత్సరాల తరబడి ఆందోళనలు చేస్తుంటే.. జగన్ కనీసం ఒక్కరోజు కూడా ధర్నా ప్రాంగణానికి వెళ్లి వారికి మద్దతు తెలపలేదు. అప్పట్లో కార్మికులను విమానాశ్రయానికి పిలిపించుకుని మాట్లాడిన జగన్.. ఇప్పుడు కూడా కార్మిక సంఘాల నాయకులను తన వద్దకే పిలిపించుకుని రాజకీయం చేస్తున్నారు" అని హోంమంత్రి మండిపడ్డారు.ఒకప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్.. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో 99 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేసే స్థితికి చేరుకుందని వంగలపూడి అనిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందంటూ ఆమె పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదాల్లో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తొలిసారిగా 'శాశ్వత ఉద్యోగం' కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామి తీసుకున్నారని తెలిపారు.మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రస్తుతం రూ.60 లక్షల నుండి రూ.1 కోటి వరకు బీమా ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా కేంద్ర ఉక్కు మంత్రిని విశాఖకు తీసుకురాలేకపోయారని, కానీ ప్రస్తుత కేంద్ర మంత్రి కుమారస్వామి స్వయంగా ప్లాంట్‌లో తెల్లవారుజాము వరకు ఉండి పరిస్థితులను సమీక్షించారని అనిత గుర్తుచేశారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంపై స్పందిస్తూ.. ఆ సంస్థ రూ.150 కోట్ల బీమా చెల్లించాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం కేవలం రూ.12 కోట్లు మాత్రమే కట్టించుకుని చేతులు దులుపుకుందని హోంమంత్రి ఆరోపించారు. అంతేకాకుండా, గంగవరం పోర్టులో ఏపీ ప్రభుత్వానికి రావాల్సిన 10.24 శాతం వాటాను కూడా గత వైసీపీ ప్రభుత్వమే వదులుకుందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడింది తమ కూటమి ప్రభుత్వమేనని, ప్లాంట్ పరిరక్షణ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# అత్యాశ వదులుకుంటేనే..

**మొదటి పేజీ రువాయి**

ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టులందరూ పోలీసులకు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని ప్రకటించారు. మావోయిస్టులకు రివార్డులు కూడా ఇచ్చేశామని, ప్రస్తుతం వారికి ఉపాధి కల్పించే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. మావోయిస్టులే లేనందున వారి ఏరివేత కోసం ఏర్పాటు చేసిన బలగాలను ఇతర సేవలకు వినియోగిస్తామని వివరించారు.

**మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలు**

దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఉనికి లేదని, ఆ పార్టీలో ఒకరిద్దరు మాత్రమే మిగిలి ఉన్నారని, అందుకోసం వారి నియంత్రణ కోసం గ్రేహౌండ్స్ దళాల్లో ఉన్న 1200 మంది సిబ్బందిలో 500 మందిని తగ్గించి వివిధ విభాగాల్లో సర్దుబాటు చేస్తామని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. గుడిహత్నూర్ మండలం తోషంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. వారితో కలిసి లొంగిపోయిన ముగ్గురు మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలు, వాహనదారులకు హెల్మెట్లు, స్థానికులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, పిల్లల పార్కు, కమాండ్ కంట్రోల్ రూంలను ప్రారంభించారు. అనంతరం ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గ్రేహౌండ్స్ విభాగానికి 1700 పోస్టులు మంజూరైతే 1200 మంది పని చేస్తున్నారని, వారిలో 500 సిబ్బందిని ఇతర కార్యక్రమాల్లో సర్దుబాటు చేస్తామని వెల్లడించారు.

**యువత పెడదారి పడుతున్నారు**

తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నక్సలిజం అంతరించిన మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పక హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా తొలుత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

# భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్

**మొదటి పేజీ రువాయి**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు.బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్, "ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు.అమెరికాకు చెందిన ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటన తర్వాత ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా, మంగళవారం హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఇది కేవలం ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యేనని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించింది.అయితే, తమ డ్రోన్‌ను అమెరికా హెలికాప్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ వాదిస్తోంది. ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ అణు, సైనిక కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. తాజా పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగగా, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.

# సీఎం రేవంత్‌కు ఓటమి తప్పదు

**మొదటి పేజీ రువాయి**

ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు.ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు.త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళు ్లగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.

## గమ్యస్థానానికి చేరుకోవడం ముఖ్యమే, కానీ
# సురక్షితంగా చేరుకోవడం మరింత ముఖ్యమైనది : డీజీపీ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, సంగారెడ్డి ప్రతినిధి:**
తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్ పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి హాజరైన ఆయన "ఆరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారందరూ సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, అలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ



రవాణా సౌకర్యాలను వినియోగించాలని తెలిపారు. గమ్యస్థానానికి చేరుకోవడం ముఖ్యమే అయినప్పటికీ సురక్షితంగా చేరుకోవడం మరింత ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ హరిప్రసాద్ ఫసల్వాడిలో "నో హెల్మెట్ – నో ఎంట్రీ" విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించగా, జిల్లా అధికారులు ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో...
# న్యూరో ఎండోస్కోపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

**సికింద్రాబాద్, జూన్ 10,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** న్యూరో సర్జరీ రంగంలో అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లోని సంగీత్ యూనిట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో ఎండోస్కోపీని ఘనంగా ప్రారంభించారు. నాలుగు ప్రధాన న్యూరో శస్త్రచికిత్స విభాగాలకు ఒకే వేదికపై అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ చికిత్సలు ప్రత్యేకత. ఈ కేంద్రాన్ని ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ డీఆర్‌డీవో ఛైర్మన్, మాజీ రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి శాఖ కార్యదర్శి, మాజీ రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారుగా సేవలందించిన డాక్టర్ జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ వైద్య నిపుణులు, సీనియర్ అధికారులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ నూతన కేంద్రం ద్వారా మెదడు కణితులు (బ్రెయిన్ ట్యూమర్స్), స్కల్ బేస్ డిజార్డర్స్, హైడ్రోసెఫాలస్, వెంట్రిక్యులర్ పాథాలజీస్ వంటి క్లిష్ట న్యూరోలాజికల్ సమస్యలకు అత్యాధునిక న్యూరో ఎండోస్కోపిక్ చికిత్సలు ఒకే చోట అందుబాటులో ఉంటాయి. అత్యాధునిక హై-డెఫినిషన్ న్యూరో ఎండోస్కోపిక్ పరికరాలు మరియు బహుళ విభాగాల న్యూరోసైన్సెస్ నిపుణుల బృందం సహకారంతో ఈ కేంద్రం పనిచేయనుంది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ శిగకోల్లి మాట్లాడుతూ... న్యూరో ఎండోస్కోపీ కారణంగా క్లిష్టమైన మెదడు వ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. హై-డెఫినిషన్ విజువలైజేషన్ మరియు అత్యంత ఖచ్చితమైన పరికరాల సహాయంతో మెదడులో లోతైన భాగాలను కూడా సురక్షితంగా చేరుకోవడం సాధ్యమవుతోంది. దీంతో శస్త్రచికిత్స సమయంలో గాయాలు తగ్గి, నొప్పి తక్కువగా ఉండి, రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచ స్థాయి న్యూరో ఎండోస్కోపిక్ సేవలను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం" అని తెలిపారు. ముఖ్య అతిథి డాక్టర్ జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, "ఇమేజింగ్, నావిగేషన్, ఆప్టిక్స్ మరియు ప్రెసిషన్ టెక్నాలజీలలో వచ్చిన పురోగతి వైద్యరంగాన్ని కొత్త దిశగా తీసుకెళ్తోంది. ఈ ఆధునిక సాంకేతికతలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో మెడికవర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషి అభినందనీయం. న్యూరోసైన్సెస్ రంగంలో ఈ కేంద్రం రోగులకు మరింత మెరుగైన చికిత్స ఫలితాలను అందిస్తుందని నమ్ముతున్నాను" అని పేర్కొన్నారు.ప్రస్తుతం మెదడు కణితులు, హైడ్రోసెఫాలస్, పిట్యూటరీ ట్యూమర్లు మరియు ఇతర స్కల్ బేస్ వ్యాధులు అధునాతన ఇమేజింగ్ సదుపాయాల వల్ల ప్రారంభ దశలోనే గుర్తించబడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మినిమల్ ఇన్వేసివ్ న్యూరో ఎండోస్కోపిక్ చికిత్సలు రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభంతో మెడికవర్ హాస్పిటల్స్ న్యూరోసైన్సెస్ రంగంలో తన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, అత్యాధునిక సాంకేతికత, నిపుణుల సేవలు మరియు సమగ్ర చికిత్సా సదుపాయాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డా. వికాస్ అగర్వాల్ (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్), డా. శ్రీనివాస్ రావు దూసా (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్), డా. సుధీర్ పెంచాల పుట్టిబోయిన (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్), డా. రోహిత్ రమేష్ వడిఖాయే (కన్సల్టెంట్ న్యూరోసర్జన్)తో పాటు సెంటర్ హెడ్ కృష్ణవేణి పాల్గొన్నారు.




### ఘనంగా బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఎజాజ్ పాషా జన్మదిన వేడుకలు

***పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10:***
*సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ పరిధిలోని ఎంజీ రోడ్డులో గల బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎజాజ్ పాషా స్వగృహంలో జన్మదిన వేడుకలను ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజాజ్ పాషాకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఎజాజ్ పాషా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మస్కురి నాగేష్, జట్ల రాము, రాజు, షకీల్ బాయ్, ఆంజనేయులు యాదవ్, నాగసాని రమేష్, నాగసానీ నరేందర్, నరేష్ ,ప్రజా పిలుపు న్యూస్ ఛానెల్ అదినేత విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.*



## దేశ ప్రధానమంత్రిగా మోదీ
# 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా ప్రత్యేక పూజలు

**పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన భానుక నర్మదా మల్లికార్జున్**

**సికింద్రాబాద్, జూన్ 10, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాల కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాభినందనలు తెలుపుతూ ప్రధాని ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ లోని వార్డు 2లోని జైన్ మందిరం మరియు స్వామి నారాయణ ఆలయంలో అలాగే 6వ వార్డ్ లోని తాడ్ బంద్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్.ఈ సందర్భంగా బానుక నర్మద మల్లికార్జున్ మాట్లాడుతూ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మన దేశ ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలుపుతున్నాం. ప్రధాని దేశ సేవల అందించే విధంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించుకొని హనుమాన్ చాలీసా కూడా చదవడం జరిగింది.ఆ భగవంతుడు ప్రసాదించాలని ఈ సభాముఖంగా, తాడ్‌బండ్ ఆంజనేయ స్వామి ముందు భానుక నర్మదా కోరుకున్నారు. దేశానికి రక్షణ కవచం లాగా ఉంటారు అని ప్రపంచంలో గొప్ప ప్రధానిగా చరిత్రలో నిలిచి పోయారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు,మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్ శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు బానుక మల్లికార్జున్ మరియు తదితర వార్డు అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇంపాక్ట్ 'ప్రతిభకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రతిభకు పట్టాభిషేకం" కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నాగేష్ కుమార్ షేట్కార్ పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన మార్గదర్శకత్వం, ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. యువత భవిష్యత్తు నిర్మాణంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు స్థానిక స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహిర్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్,మైతబ్, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పోరాటానికి ఫలించిన విజయం

**సహకరించిన అన్ని పార్టీలకు ప్రజలకు కోడిచర్ల తండా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బిచ్య నాయక్ కృతజ్ఞతలు**

**బిఆర్ఎస్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు**



**హైదరాబాద్ పల్స్, జూన్ 10, షాద్నగర్ :**
సిద్దపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదన నేడు ఒక కొలిక్కి వచ్చింది. అక్కడ ఎలాంటి డంపింగ్ యార్డ్ రావట్లేదని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తేల్చి చెప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఇదంతా ప్రజా పోరాటానికి ఫలించిన విజయమని కోడిచర్ల తండా గ్రామపంచాయతీ వార్డు సభ్యులు బిచ్య నాయక్ అన్నారు. బుధవారం కొత్తూరులో ముదిరాజ్ భవన్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ఎమ్మెల్యే మాట్లాడుతూ..కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్ రెవెన్యూ పరిధిలో ప్రతిపాదిత చెత్త డంపింగ్ యార్డ్ రాబోవడం లేదని తేలడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా బిచ్చా నాయక్ మాట్లాడుతూ.. ఈ ప్రజా విజయం బిఆర్ఎస్ నాయకుడు డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ప్రజా ఉద్యమాన్ని ప్రజల్లో తీసుకువెళ్లి ప్రజా ఉద్యమాన్ని నాయకత్వం వహించి ప్రభుత్వం దిగివచ్చి ప్రతిపాదన వెనక్కి తీసుకునే విధంగా అయన ఉద్యమాన్ని ఊపిరి పోసారని ఆయన కృషి పట్టుదల ఉన్నందున గెలుపు సాధ్యమైందని సత్యనారాయణకి మరియు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు.

# పిఎం"విశ్వకర్మ"యోజన ద్వారా కుల వృత్తులకు పూర్వవైభవం....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతరించిపోతున్న సాంప్రదాయ కుల వృత్తులను ఆదుకోవడానికి, వాటికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రవేశపెట్టిన పిఎం "విశ్వకర్మ" యోజన పథకం కింద బుధవారం రోజు రూ. 15,000 విలువైన అత్యాధునిక టూల్ కిట్ (ఎలక్ట్రికల్ కుమ్మర సారీ) నీ అందుకోవడం జరిగిందని రాజపేట మండలం జాల గ్రామానికి చెందిన కొల్లూరు రమేష్ తెలిపారు.? ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... చేతి వృత్తుల వారి నైపుణ్యానికి గుర్తింపునిస్తూ, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందనీ. స్థానిక వృత్తులను ప్రోత్సహిస్తూ మాకు కొండంత అండగా నిలిచిన కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో గ్రామ అభివృద్ధికి అందరు సహకరించాలి.....!

**- గ్రామ సర్పంచ్ నాజీయ లాయక్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10,జహీరాబాద్:**



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కవేలి సర్పంచ్ నాజీయ లాయక్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలోని కవేలిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను తెలుసుకుని వాటిని ప్రణాళికబద్ధంగా గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈనెల 6న ప్రారంభమై ఈ రోజు వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కొనసాగింది అని గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పార్టీలకతీతంగా ముందుకు వచ్చి మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుంటూ ప్రభుత్వ నిధులు మంజూరు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోహిర్ ఎస్సై నరేష్,పోలీస్ సిబ్బంది, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చక్రవర్తిని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**హైదరాబాద్ పల్స్, జూన్ 10, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలంలోని బంకర్ సింగ్ తండా గ్రామానికి చెందిన ప్రముఖ బీఆర్ఎస్ నాయకుడు ధర్మసోత్ చక్రవర్తి ఇటీవల బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం ఖమ్మంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను బుధవారం మాజీ మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా చక్రవర్తి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న సత్యవతి రాథోడ్, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆయనకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ బీఆర్ఎస్ నాయకులు మన్యుప్యాట్ని, ధారావత్ కృష్ణ తదితరులు పాల్గొని చక్రవర్తి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

## రైతులను దోచుకుంటున్న ఫర్టిలైజర్ షాప్ లపై చర్యలు తీసుకోవాలి

### ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఎం సురేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10,జహీరాబాద్ :** జహీరాబాద్ ప్రాంతంలో అడ్డుగోలుగా తమ ఇష్టానుసారంగా ఫర్టిలైజర్ షాప్ యజమాన్యాలు రైతులకు అధిక ధరలకు మందుల అమ్ముతూ అధిక ధరలకు విక్రయిస్తూ ప్రభుత్వం నియమించిన ధరలకే ఇవ్వాలని అడిగితే మా దగ్గర మందులు లేవు వెళ్లిపోండి అని బెదిరిస్తున్నారని డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి ఏడి బిక్షపతికి భారత్ కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ మాట్లాడుతూ రైతులను ఫర్టిలైజర్ షాప్ యజమాన్యాలు రైతులకు తమ ఇష్టానుసారంగా లాభర్జన దేంగా రైతులకు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా తమ ఇష్టానుసారంగా డబ్బులే లాభార్జనంగా చేసుకొని నాసిరకమైన మందులు ఇస్తూ అధిక ధరలకు యూరియా గానీ డి ఏ పి. కంప్లెక్స్ వాస్తవానికి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఫర్టిలైజర్ షాపులో స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి తప్పనిసరిగా రైతుకు తెలియాలి ఇలా ఏ షాపులో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించడం లేదు అంతే కాకుండా పురుగుల మందులు విత్తనాలు మొదలగినవి అధిక ధరలకు అమ్ముతూ రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇయ్యకుండా తమ ఇష్టానుసారంగా ఫర్టిలైజర్ షాప్ యజమానులు పెట్టుకున్న రేటు కే రైతులు కొనాల్సిన పరిస్థితి వచ్చింది కనుక రైతులపై దయవుంచి తక్షణమే ఫర్టిలైజర్ షాపులపై తనిఖీలు నిర్వహించి రైతులను మోసం చేస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. ఐఎఫ్టియు డివిజన్ నాయకులు జి నరేందర్,గోపాల్, అనిరుద్,ఆకాష్ తదితరులు పాల్గొన్నారు

## గొల్లచర్లలో ఘనంగా చిలుమూల రఘు జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్, జూన్ 10, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు చిలుమూల రఘు 26వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రఘుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల సందర్భంగా నాయకులు రఘును శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ యువతకు అండగా నిలుస్తున్న రఘు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యువ నాయకుడిగా రఘు మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేరెడ్డి బిక్షం రెడ్డి, చేరెడ్డి సమ్మిరెడ్డి, గంధసిరి ఉపేందర్ గౌడ్, చేరెడ్డి చిన్న బిక్షం రెడ్డి, చేపూరి లింగయ్య, పానుగంటి రామాచారి, సొల్లేటి బాబురావు, ముదిరెడ్డి ఉపేందర్ రెడ్డి, సోనబోయిన సోమయ్య, బాలు నాయక్, మంద నాగయ్య, గూడూరు వెంకన్న, గోపి వెంకన్న, కల్లెపు అశోక్, పగిడిపల్లి ఉపేందర్, సాగర్, రెంటాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో ఎస్.ఐ.ఆర్ పై అవగాహన సదస్సు

### ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో నిర్వహణ



**సికింద్రాబాద్, జూన్ 10, హైదరాబాద్ పల్స్ న్యూస్ ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులో భాగంగా బుధవారం రోజు కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని క్లాసిక్ గార్డెన్‌లో ఎస్ఐఆర్ పై స్థానిక కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్ నేతృత్వంలో బిఎల్ఏ లకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, ఎస్ఐఆర్ కంటోన్మెంట్ కోఆర్డినేటర్ కల్వ సుజాత, కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కైలాష్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ యొక్క తేదీలను, ఎస్ఐఆర్ ప్రక్రియను, విధివిధానాలను, సాంకేతిక వివరాలను, పాటించాల్సిన జాగ్రత్తలను కార్యకర్తలకు వివరంగా తెలియచేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఈ ప్రక్రియ జరిగేలా చూసుకోవడం కార్యకర్తల బాధ్యత అన్నారు. ప్రజలు, అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించడం జరిగింది. గతంలో కర్నాటక, బెంగాల్ లో జరిగిన ఓట్ చోరీ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని,ఈ ప్రక్రియలో అక్రమాలు జరగకుండా చూసుకోవాలని, ఓట్లు అక్రమంగా తొలగించడం కాని, అక్రమంగా కొత్తవి చేర్చకుండా చూసుకోవాలని, అదే సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేలా చూడాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కంటోన్మెంట్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి...!

**- ఎస్ఐ,నరేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, జహీరాబాద్ :**
కోహిర్ మండలం కవేలి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో బుధవారం వాహనదారులకు గ్రామస్తులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోహిర్ ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు మాత్రమే వాహనాలు నడపాలని ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎక్కువ శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దీంతో ప్రాణాలు కూడా కోల్పోతున్నారని అలాగే కార్లు నడిపే వారు కూడా సీటు బెల్టు విధిగా పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడప కూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాజీయ లాయక్, వార్డు సభ్యులు, ప్రభుత్వ అధికారులు, వాహనదారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట కురుమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక



**హైదరబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట కురుమ సంఘం నూతన అధ్యక్షులు గా కాకల్ల భరత్ ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్ సన్మానం చేసి అభినందించారు. కుల పెద్దలు కాకల్ల రామయ్య, మేక ఐలయ్య, మాజీ అధ్యక్షులు కాకల్ల ఉపేందర్, కాకల్ల ఐలయ్య, జన్న సిద్ధులు, చిగుళ్ళ బీరయ్య, రేగు సిద్ధులు, రేగు శ్రీశైలం, కాకల్ల కమలాకర్, కాకల్ల సిద్ధులు, కాకల్ల మల్లయ్య, కాకల్ల రామచంద్రం, ఎల్లయ్య దోమల పాండు, దోమల లక్ష్మణ్, మేక సిద్దులు, మేక మల్లేశం, రేగు కనకయ్య, జనశ్రీను. కాకల్ల రంజిత్ కుమార్ లు పాల్గొన్నారు.

## రాజపేటలో ఘనంగా సట్టు తిరుమలేష్ జన్మదిన వేడుకలు....

**ప్రజ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న సట్టు తిరుమలేష్...**

**పార్టీ కోసం, నాయకత్వానికి నమ్మిన బంటుగా తిరుమలేష్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
పార్టీ కోసం, కార్యకర్తల, ప్రజల కోసం, నాయకత్వానికి నమ్మిన బంటుగా ఉంటూ నిరంతరం శ్రమిస్తున్న బిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అభినందనీయుడని పలువురు ప్రశంసించారు. బుధవారం రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. రాజపేట మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ముందు బిఆర్ఎస్ నాయకులు







ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానుల మధ్య సట్టు తిరుమలేష్ కేక్ కట్ చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. పలువురు తిరుమలేష్ కు పుష్పగుచ్ఛం శాలువా పూలదండలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. రాజపేట మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, రాజపేట పట్టణ అధ్యక్షులు బెడిద వీరేశం, మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, ఆలేరు వ్యవసాయం మార్కెట్ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ ప్రతినిధుల ఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, దగ్గుల విష్ణు, రామిండ్ల నరేందర్, నాగిర్తి గోపి, ఎమ్మ భాస్కర్, గజ్జల రాజు, గొల్లపల్లి సాయి, కటకం వెంకటేష్ **తదితరులున్నారు.**

**శ్రీ స్వామివారి లడ్డు ప్రసాదం అందజేసిన పులి చంద్రమౌళి**

తిరుమలేష్ జన్మదినం సందర్భంగా రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పులి చంద్రమౌళి, రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు ఉప్పల రమేష్ లు యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అభిషేక లడ్డు ప్రసాదం విశేష శాలువా స్వామివారి పూలమాల కంకణంతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని బడిబాట ప్రచారం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** రాజపేట మండలం సింగారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ అందిస్తున్న సదుపాయాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, సర్పంచి కొండా ప్రమీల, ఉపసర్పంచి కొవ్వూరి కర్ణాకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు యేల సరిత, తదితరులు పాల్గొన్నారు. సింగారంలో ప్రారంభమయ్యే ప్రీస్కూల్ లో విద్యార్థులను చేర్పించాలని కోరారు.

## ఘనంగా సత్యనారాయణ దాస్ జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట లోని మహిమాన్విత అతి పురాతన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మఠం ఆలయ వంశపారంపర్య అర్చక స్వాములు సత్యనారాయణ దాస్ మహంతి జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు. స్నేహితులు పలువురు సత్యనారాయణ దాస్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు.

## మృతుని కుటుంబనికి జైశ్రీరామ్ ఫౌండేషన్ సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బోగ సత్తయ్య కుటుంబనికి బుధవారం జై శ్రీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో (181వ) 5000 ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో రాజపేట సర్పంచ్ కోయ మధు, కాసోజు సంపత్, చెలమలపల్లి లక్ష్మన్, సంగం మధు, సాధబోయిన శంకర్, కొన్నే విజయ్, పులంగారి శ్రీకాంత్, బల్ల కృష్ణ, నగపూరి ప్రవీణ్, గోపి, కాజా, కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మల్లగూడెంలో ప్రగతి ప్రణాళిక ముగింపు గ్రామసభ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల ముగింపు ప్రత్యేక గ్రామసభ రాజపేట మండలం మల్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేసారు. ఈ గ్రామసభ కు గ్రామ సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత రాజు, వార్డు సభ్యులు, నీల కనకమ్మ రాములు, గొడుగు బ్రహ్మయ్య, నీల జహంగీర్, గొడుగు కల్పన కనకయ్య, బోయిని నాగరాజు, ఎంపీడీవో, ఎంపిఓ, ఎంఏఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ, ఎలక్ట్రిసిటీ ఎఇ, పిఆర్‌ఎఇ, హౌసింగ్ ఎఇ, ప్రైమరీ స్కూల్ టీచర్, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శి కొండ చక్రధారి, జిపిఓ గ్రామ మహిళా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# రుద్రారంలో వార్డు సభ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సమావేశం

**మున్సిపల్ చైర్ పర్సన్ మోటే సుమలత ఆధ్వర్యంలో**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత ఆధ్వర్యంలో మరియు మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ రావు, డిప్యూటీ తాసిల్దార్.రుద్రారం వార్డు కార్యాలయంలో వార్డు సభ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రుద్రారం 23, 24, 25, 26, వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభ నిర్వహించిన చైర్మన్ మోటే సుమలత, రుద్రారం కౌన్సిలర్లు వార్డు సభా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రుద్రారం గ్రామంలోని 4 వార్డులను కలుపుకొని రుద్రారం కార్యాలయంలో వార్డు సభ సమావేశం నిర్వహించారు.ఈ సభలో ప్రధానంగా సమస్యల ప్రభుత్వశీ నుండి అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడం పైన చర్చించడం జరిగిందని, మొదటిది సానిటేషన్ గ్రామంలో నెలకొన్న మురుగునీరు వీధి దీపాల సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, తడిచెత్త, పొడి చెత్త, వేరు చేసే, విధానంలో గ్రామస్తులకు అవగాహన కల్పించామణి, వచ్చే వర్షాకాలంలో మలుపు ప్రాంతలలో ఇండ్ల మధ్య నీరు నిలవకుండ చూసుకునేలా, మరియు ఓటరు జాబితా మ్యాపింగ్, సవరణ, సెన్సెస్ పై గ్రామ ప్రజలకు సంబంధిత శాఖ అధికారులతో పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, కౌన్సిలర్లు, అగ్రికల్చర్ అధికారి స్థానిక డాక్టర్ మాజీ సర్పంచ్ రెడ్డి డిప్యూటీ తాసిల్దార్, బి. పాండు, పెలిమెలీ లత వెంకటేష్, వడ్డే రాజు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, బలరాం, వార్డుల సంబంధించిన పెద్దలు, ప్రజలు యువకులు, మహిళలు పాల్గొన్నారు.




# సెన్సార్ బోర్డు సభ్యురాలిగా గీతం అధ్యాపకురాలు

**సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్, హైదరాబాద్ రీజియన్ లో నియామకం**

పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ మైథిలి మారట్ అనూప్ ను, భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీ.బీ.ఎఫ్.సీ), హైదరాబాదు రీజియన్ సలహా మండలి సభ్యురాలిగా నియమించింది.సీ.బీ.ఎఫ్.సీ., హైదరాబాదు ప్రాంతీయ అధికారి డాక్టర్ రాహుల్ గౌలికర్ జారీచేసిన అధికారిక ప్రకటన ప్రకారం, డాక్టర్ మైథిలి మూడేళ్ల కాలానికి లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు, ఏది ముందు అయితే అది, సలహా మండలిలో సేవలందిస్తారు.డాక్టర్ మైథిలి మారట్ అనూప్ ఒక ప్రఖ్యాత ప్రదర్శన కళాకారిణి, విద్యావేత్త, పరిశోధకురాలు. ఆమె రెండు దశాబ్దాలకు పైగా భారతీయ శాస్త్రీయ నృత్యానికి, ముఖ్యంగా మోహినియాట్టానికి అంకితభావంతో సేవలందిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్), దూరదర్శన్– రెండింటిలోనూ ప్యానెల్ సభ్యురాలిగా ఉన్న ఆమె, తన కళా నైపుణ్యానికి, పాండిత్యపరమైన కృషికి విస్తృత గుర్తింపు పొందారు.ఆమె విశిష్టమైన వృత్తి జీవితంలో అనేక ప్రశంసలు పొందిన ఏకపాత్రాభినయ నాటకాలు, నృత్య చిత్రాలు, 'ప్రేమ్ రాక్స్ రస; పూతప్పాట్టు, దుశాల' వంటి ప్రముఖ నాటకాలలో ప్రధాన పాత్రలు ఉన్నాయి. ప్రదర్శన కళల రంగానికి ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆమెను ప్రతిష్టాత్మక 'రుక్మిణి దేవి అరుండేల్ అవార్డు 2025'తో సత్కరించింది.తన కళాత్మక విజయాలతో పాటు, డాక్టర్ మైథిలి ఐఐటీ బొంబాయి నుంచి పిహెచ్.డి. పట్టా పొందారు.



హైదరాబాదులోని గీతంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఆమె రచయిత్రి కూడా. పరిశోధన, బోధన, సృజనాత్మక అభ్యాసం ద్వారా నృత్యం, నాటకం, సాంస్కృతిక అధ్యయన రంగాలను ఆమె రచనలు ముందుకు తీసుకువెళ్తున్నాయి. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్–ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు డాక్టర్ మైథిలి నియామకంపై హర్షం వెలిబుచ్చారు. ఇది విశ్వవిద్యాలయానికి, దాని విద్యా సమాజానికి (అకడమిక్ కమ్యూనిటీ) గర్వకారణమని వారు అభివర్ణించారు.

# కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్బంగా పలు సేవా కార్యక్రమాలు

**బొల్లారం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** బీజేపీ అధ్యక్షులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు బుధువారం అయన పాల్గొన్నారు.బొల్లారం జిహెచ్ఎంసి 272 డివిజన్ బిజెపి పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు ప్రదీప్, దిలీప్, అంబోజ్, మోహన్, శివ, లక్ష్మణ్, సంతు, సంజయ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి గుడిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలాగే బ్రతుకుదెరువు కోసం వచ్చి కూలీ చేసుకునే బ్రతుకుతున్న గాంధీనగర్ వాసి వెంకటేష్ (25) ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ లో కాలు విరిగి, తీవ్ర గాయాలతో ప్రస్తుతం కోమాలో ఉన్నాడు. కొడుకు పరిస్థితి చూసి తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరు అవుతుండగా ఆ కుటుంబం ఆకలితో అల్లాడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆనంద్ కృష్ణారెడ్డి తన పుట్టినరోజు వేడుకలను పక్కనపెట్టి, వెంటనే స్పందించి వెంకటేష్ కుటుంబానికి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే 500 మంది మహిళలకు చీరలు పంచి వారి ఆశీస్సులు తీసుకున్నరు. ఈ వేడుకల్లో ఉండగానే మార్కెట్ నుండి వస్తున్న రాజు అనే వ్యక్తికి లారీ ఢీకొట్టి యాక్సిడెంట్ అయ్యింది. కాలు విరిగి, ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న రాజు నేరుగా ఆనంద్ కృష్ణారెడ్డి అన్నకు ఫోన్ చేసి, తనని కాపాడమని వేడుకున్నాడు. వెంటనే అన్న ఘటనా స్థలానికి పరుగెత్తుకెళ్లి అతన్ని ఆదుకున్నారు. ఇది చూసి అభిమానులు అన్నా! నీ పుట్టినరోజున కూడా ఇలా వేడుకలు వదిలేసి తిరుగుతుంటే ఎలా?" అని అడగగా "మనుషులు బాగున్నప్పుడు వచ్చి బీరు, బిర్యానీలు పంచడం కాదు.. మనిషి ఆపదలో, చావుబతుకుల మధ్య ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడేవాడే నిజమైన నాయకుడు" అని తమ అభిమానులు తెలిపారు. అ మాటలకూ తమ అభిమానులు ముగ్ధులయ్యారు. నిజమైన ప్రజా సేవకుడు అంటే నువ్వే అన్నా.. నీకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. వర్ధిల్లాలి కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి అన్న నాయకత్వం అని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ, నాయకులు, తన కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# బోయిన్పల్లి చౌరస్తాలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సు

**బోయిన్పల్లి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహణ**

**ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్**




**బోయిన్పల్లి, జూన్ 10, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులే ఒక్కటే ఉత్తమ మార్గం అని మల్కాజ్గిరి డీసీపీ తెలిపారు.బుధవారం రోజున మధ్యాహ్నం బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. న్యూ బోయిన్పల్లి క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ తరచు ప్రమాదాలకు గురి అయ్యే ప్రాంతాలపై వాహన దారులకు అవగహన కల్పించి, భద్రత నియమాలను పాటించేలా చేయడమే ఈ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశ్యం అని, ప్రచారాల ద్వారా సామాజిక మార్పు, వాహనదారుల్లో అలసత్వం పోతుందని, ముఖ్యంగా సెల్ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని,మద్యం త్రాగి డ్రైవింగ్ చేసి కుటుంబానికి దూరం అవ్వద్దని ఈ సందర్బంగా డీసీపీ తెలిపారు.ద్విచక్ర వాహనా దారులు హెల్మెట్,నాల్గు చక్రాల వాహన దారులు సీట్ బెల్ట్ ధరించాలని అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేపట్టారాదని సమాజంలో ఒక బాధ్యత గల పౌరుడిగా మెలగాలని ఈ సందర్భంగా పోలీసులు అవగహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్ (ఐ.పి.ఎస్), మల్కాజ్ గిరి జోన్ గోపాలకృష్ణ మూర్తి (ఏసీపీ), బేగంపేట్ డివిజన్, ఎన్.తిరుపతి రాజు (ఎస్.హెచ్.ఓ) బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్, జి.జానకి రాములు (ఎస్.హెచ్.ఓ) ట్రాఫిక్ బేగంపేట్ పోలీస్ స్టేషన్, బి. వర్ధన్, ఎస్ఐ, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ మరియు శివరాజ్, ఎస్.ఐ, ట్రాఫిక్ బేగంపేట్ పోలీస్ స్టేషన్ హాజరై ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో రంజిత్, ఏ.ఈ, హెచ్ఎండీఏ, జగన్ మోహన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, వై. స్వామి, ఎంవీఐ, తిరుమలగిరి, డాక్టర్ సుష్మ అవినాష్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, యూపీహెచ్‌సీ బోయిన్‌పల్లి, కృష్ణక్రాంత్, ఏ.ఈ, కంటోన్మెంట్, మరియు ద్వారకానాథ్ రెడ్డి, అసిస్టెంట్ ఎంవీఐ, తిరుమలగిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాధారణ ప్రజలు, విద్యార్థులు మరియు యువతకు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించారు.

## ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
# క్రీడా పోటీలు, క్రీడా కేంద్రాలు

**పటాన్చెరు ఎమ్మెల్యే, ఉమ్మడి మెదక్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో క్రీడాకారుల కోసం కోచింగ్ కేంద్రాలు, క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి క్రికెట్ క్లబ్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పటాన్చెరు ఎమ్మెల్యే, అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒలంపిక్ డే సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతి త్వరలో ఒలింపిక్ రన్, మొక్కలు నాటడం, సైకిల్ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా క్షేత్రస్థాయి నుండి క్రీడా పోటీలు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు.



పటాన్చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధి కోసం ఐదు మినీ స్టేడియాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మైత్రి మైదానం వేదికగా ఏడాది పొడవునా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రఘునందన్ రెడ్డి, ఎల్లయ్య, హరికిషన్, బుచ్చిరెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ కలెక్టర్ కార్యాలయం ముట్టడి విజయవంతం

**కలెక్టరేట్ పరిసరాల్లో ఉత్కంఠ.. ఉద్రిక్తత**

**అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన నాయకులు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** పెంచిన ఇంధన ధరలు తగ్గించాలని, నిత్యావసరాల ధరలను పేదలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసన ధర్నా ఉత్కంఠ ఉద్రిక్తంగా మారింది. జిల్లాలోని వివిధ మండలాలనుంచి వేలాదిగా తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నాచేశారు. కలెక్టరేట్ ప్రధాన రహదారిపై భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం కార్యాలయం ప్రధానద్వారం ముందు నేలపై పడుకొని నిరసన నిరసన తెలిపారు. శాంతియుత ధర్నాను పోలీసులు అడ్డుకునే ప్రయంత్రం చేయడంతో నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో కడుపుమండిన కార్యకర్తలు ప్రధాన ద్వారాన్ని తోసుకుంటూ కలెక్టరేట్లోకి చొచ్చుకొని వెళ్లే



ప్రయంత్రం చేయడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం ఉద్రిక్తం మారింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా, దేశంలో మాత్రం ఇంధన ధరలను పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి రేషన్ షాపుల ద్వారా అన్నిరకాల నిత్యావసర సరుకులను సబ్సిడీపై అందించకుండా, పేదలకు అందకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. మార్కెట్లో నిత్యం సాగుతున్న బ్లాక్ మార్కెట్ ను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ





తీరు మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, కె సారయ్య, మున్నా లక్ష్మి కుమారి, చంద్ర నరేంద్ర కుమార్, వి పూర్ణచందర్ రావు, జి వీరాస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వర్ రావు, భూక్యా దస్రు, యు రాహుల్, ఎస్ కె ఫహీమ్, మండలాల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


# అక్రమ సెల్లార్ జి ప్లస్ త్రీ నిర్మాణాలు తెలిసి కూడా ఎందుకు మౌనం ?

**రాజకీయ నాయకులకు అధికారులు తలొగ్గేనా ?**

**ఇదేనా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలు అంటే ?**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా పలు దినపత్రికలలో అక్రమ సెల్లార్ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు నిలుపుదల చేయాలని వార్త దినపత్రికలో ప్రచురిస్తున్నప్పటికీ అధికారులు రాజకీయ నాయకుల మాటలకు లోబడి వారు చేసే వృత్తిని మర్చిపోయిన పరిస్థితి చుంచుపల్లి మండలంలో ఏర్పడ్డది. అక్రమమని తెలిసినప్పటికీ అధికారులు అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయలేకపోతున్నారు. దీనికంతటికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని తెలుస్తుంది. వర్షాలు వచ్చి రోడ్లన్నీ జలమయమై మునిగిపోతే పరిస్థితి ఏమిటి? రాజకీయ నాయకులు కాపాడుతారా ప్రజల ప్రాణాలతో చెలగాటాలెదుకు అనీ నిలదీస్తున్న ప్రజలు. గిరిజన చట్టాలను అధికారుల అండదండలతోటే తుంగలో తొక్కుతున్నారని గిరిజన నాయకులు వాపోతున్నారు. ఐటిడిఏ అధికారులు స్పందించి గిరిజనుల చట్టాలని కాపాడాలని అక్రమ సెల్లార్ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలను నిలుపుదల చేయాలని గత ఐదు సంవత్సరాలుగా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై ఒక కమిటీని వేసి అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన చట్టాలను కాపాడాలని కోరుతున్న ప్రజలు. రేపు రాబోయే వర్షాలకు విద్యానగర్ పంచాయతీ ఈ అక్రమ కట్టడాల తో వర్షం నీరు వెళ్లడానికి దారి లేక





మునిగిపోయే పరిస్థితి కచ్చితంగా వస్తుందని దానికి పూర్తి బాధ్యత మండల పంచాయతీ అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని విద్యానగర్ ప్రజలందరూ గమనిస్తున్నారని పలువురు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా పలు రాజకీయ నాయకులు ప్రజా సంఘాలు ఈ అక్రమ నిర్మాణాలను ఖండించాలని విద్యానగర్ పంచాయతీ మునిగిపోకుండా చూడాలని కోరుతున్న ప్రజలు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన లక్ష్యం....

**మున్సిపల్ చైర్పర్సన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా భువనగిరి పట్టణంలో నిర్వహించిన 35వ వార్డు సభలో మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ కమిషనర్, చంద్ర ప్రకాష్ రెడ్డి పట్టణ సీఐ సురేష్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజాపాలన ప్రధాన



ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో అభయ హస్తం 6 గ్యారంటీలను గడప గడపకు చేర్చుతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని హామీ ఇచ్చారు. మరియు అన్ని విధాలుగా పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని త్రాగునీటికి ఇబ్బంది లేకుండా వార్డులలో బోర్లు వేయించామని, పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించుకొని వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటియాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని, సాలిడ్ వెస్ట్ మేనేజిమెంట్ రూల్స్-2026, జల్ సంచయ్ క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షాకాల సంసిద్ధతపై ప్రతి ఇంటికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ,"రోడ్డు భద్రతా" కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని, మైనర్లు వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగళ్ళ పల్లి రవికుమార్ దేవరకొండ జనార్ధన్, షరీఫ్ హమీద్ జహంగీర్, మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది, వార్డు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వచ్చే ఎన్నికలల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం..

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఈరోజు భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో భారతదేశ ప్రధాని గా నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యాదాద్రి కొండపైకి బస్ లో వెళ్లి స్వామి వారి దేవాలయంలో ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ 100 ఏండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అర్చన, ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, వేముల అశోక్ మాట్లాడుతూ... ప్రపంచ ప్రియతమ నేత ఈ ప్రజా స్వామ్య దేశం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికై 12 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూజలు చేసి పాలబిషేకం చేయడం జరిగిందనీ అన్నారు. వచ్చే ఎన్నికలల్లో తెలంగాణ లో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభరి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గూడూరు నారాయణ రెడ్డి, ఏలే చంద్రశేఖర్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శు పడమటి జగన్మోహన్ రెడ్డి, పట్టణ, జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్, మండల అధ్యక్షులు గుంటిపల్లి మహేశ్వరి సత్యం, యాదాద్రి జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీకి "మెలోని" స్పెషల్ విషెస్.. పోస్ట్ వైరల్ !!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, సెంట్రల్ బ్యూరో:** భారతదేశ చరిత్రలోనే అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన 'ఎన్నికైన' నాయకుడిగా నరేంద్ర మోడీ సరికొత్త రికార్డు సృష్టించారు. కేంద్రంలో 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న ఆయన, ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. తద్వారా దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ (ఎన్నికైన ప్రధానిగా 4,398 రోజులు) పేరిట ఉన్న రికార్డును మోడీ అధిగమించారు. ఈ చారిత్రాత్మక మైలురాయిని అందుకున్న ప్రధాని మోడీకి ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.




**వ్యూహాత్మక బంధం.. కొత్త అవకాశాలు**

ఇటీవలే మే నెలలో ప్రధాని మోడీ ఇటలీలో పర్యటించిన విషయాన్ని మెలోనీ తన పోస్టులో గుర్తు చేసుకున్నారు. రోమ్లో జరిగిన సమావేశంలో ఇరు దేశాల బంధాన్ని 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజలకు సరికొత్త అవకాశాలు సృష్టించేందుకు, భవిష్యత్తును మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ అధికారిక చర్చలతో పాటు ఇరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యం మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారింది. ఇటలీ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ.. జార్జియా మెలోనీకి 'మెలోడీ' చాక్లెట్ ప్యాకెట్ను బహుమతిగా ఇచ్చిన విషయం తెలిసిందే. నెటిజన్లు వీరిద్దరి పేర్లను కలిపి సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్న హాష్ట్యాగ్ను గుర్తు చేస్తూ మోడీ ఈ సరదా గిఫ్ట్ అందించడం విశేషం. దీనికి సంబంధించిన వీడియోను మెలోనీ తన ఇన్స్టాగ్రామ్లో పంచుకుంటూ.. 'ప్రధాని మోడీ మాకోసం ఎంతో రుచికరమైన 'మెలోడీ' టోఫీలను బహుమతిగా తెచ్చారు, థాంక్యూ' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాల అధినేతల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలకు, బలపడుతున్న భారత్-ఇటలీ బంధానికి ఈ 'మెలోడీ' ట్రెండ్ ఒక ప్రతీకగా నిలిచింది.

## అంతరిక్షంలో భారత్పై పాక్ నిఘా యుద్ధం.. 16 నెలల్లో 6 ఉపగ్రహాలు!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య 'ఆపరేషన్ సింధూర్' తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కాస్త తగ్గినట్లు కనిపించినా.. అంతరిక్షంలో మాత్రం ఒక నిశ్శబ్ద వ్యూహాత్మక



యుద్ధం మొదలైంది. చైనా పూర్తి మద్దతుతో పాకిస్తాన్ తన అంతరిక్ష నిఘా సామర్థ్యాలను శరవేగంగా విస్తరిస్తోంది. కేవలం 16 నెలల వ్యవధిలోనే ఏకంగా ఆరు భూ-పరిశీలన ఉపగ్రహాలను ప్రయోగించి, భారత భూభాగాన్ని నిరంతరం పర్యవేక్షించేలా ఒక శాటిలైట్ నెట్వర్క్ (కాన్స్టెలేషన్)ను ఏర్పాటు చేసుకుంది. 1961లో 'సుపార్కో' ను స్థాపించినప్పటి నుంచి దశాబ్దాల తరబడి నత్తనడకన సాగిన పాక్ అంతరిక్ష కార్యక్రమం.. గత 16 నెలల్లో ఇంత వేగం పుంజుకోవడం అంతర్జాతీయ రక్షణ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

## కుటుంబ సమేతంగా శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరగాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... శ్రీశైలం క్షేత్రం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనదని, జ్యోతిర్లింగ క్షేత్రంగా దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసాన్ని పొందిందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దర్శనం అనంతరం దేవస్థాన వేద పండితులు ఎమ్మెల్యేకి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అనుచరులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు....

### 150 గ్రాముల గంజాయి స్వాధీనం....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బుధవారం రోజు ముగ్గురు వ్యక్తులు సాయిగూడెం గ్రామ శివారులో బైపాస్ రోడ్డు ప్రక్కన అక్రమంగా గంజాయిని కలిగి ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు, ఆలేర్ ఇన్స్పెక్టర్ మరియు మోటకొండూర్ ఎస్ఐ, తమ సిబ్బందితో కలిసి సాయిగూడెం గ్రామ బైపాస్ రోడ్డు ప్రక్కన ఇద్దరు అనుమనితులని అదుపులోకి తీసుకొని విచారించగా, వారి వద్ద సుమారు 150 గ్రాముల గంజాయి దొరికిందనీ తెలిపారు. సదరు నిందుతులు అట్టి గంజాయిని బల్హార్షాకు మహారాష్ట్ర నుండి కొనగోలు చేసి ఆలేర్ కి తరలించి అమ్ముతున్నారు.

**నిందితుల వివరాలు**

1. సంగి రాము, వయస్సు18 సంవత్సరాలు, వృత్తి టైల్స్ వర్కర్, కులం ఎస్సి – మాదిగ, అంబేద్కర్ విగ్రహం లేన్ ఎదురుగా, సాయిగూడెం గ్రామం, ఆలేరు మండలం
2. చింతకింది మణికంట, వయసు 17 సంవత్సరాలు, వృత్తి విద్యార్థి, కులం పద్మశాలి, నివాసం బృందావన్ కాలనీ, ఆలేరు పట్టణం, యాదాద్రి-భువనగిరి జిల్లా

**స్వాదీనం చేసుకున్న వస్తువులు**

1. 150 గ్రాముల గంజాయి
2. (1) మొబైలు ఫోన్

ఈ సందర్బంగా ఆలేర్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి తాగేవారి పట్ల, అమ్మే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాము, అని హెచ్చరించారు యువత గంజాయికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కేసు అక్షాంశ్ యాదవ్, ఐపిఎస్, ఎస్పి యాదాద్రి భువనగిరి జోన్, పి.శ్రీనివాస్ నాయుడు, డిఎస్పీ యాదాద్రి, పర్యవేక్షణ లో, డి యాలాద్రి , ఇన్స్పెక్టర్, ఆలేర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి..!

### - కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్






**హైదరాబాద్ పల్స్ న్యూస్,జూన్ 10, జహీరాబాద్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోహిర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో బుధవారం నిర్వహించారు కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ ఈ సందర్భంగా పట్టణ ప్రజలను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. ఈ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం,పట్టణ అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, ప్రతి సమస్యపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని. కోహిర్ మున్సిపాలిటీలో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. వార్డులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. పట్టణంలో ఎటువంటి సమస్యలు లేకుండ సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎండీ. హన్నాన్ జావీద్, మున్సిపాల్ కౌన్సిలర్లు,అధికారులు, ప్రజా ప్రతినిధులు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్తాన్ లో కుప్పకూలిన హెలికాప్టర్.. 21 మంది సైనికులు దుర్మరణం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** పాకిస్తాన్ సైన్యానికి చెందిన ఓ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ పరిధిలోని ముజఫరాబాద్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో హెలికాప్టర్ లో ప్రయాణిస్తున్న 21 మంది సైనిక సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.



ప్రాథమిక సమాచారం ప్రకారం.. పాకిస్తాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన 'ఎమ్.ఐ–17' హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ ఘోర ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ఈ హెలికాప్టర్ పాకిస్తాన్ భద్రతా దళాలకు చెందిన సైనికులను తీసుకుని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని నీలమ్ వ్యాలీ సెక్టార్‌కు అదనపు బలగాలను తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆకాశంలో ఉండగానే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. ప్రమాదాన్ని నివారించేందుకు క్రూ సిబ్బంది హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండింగ్చేయడానికి శతవిధాలా ప్రయత్నించారు. అయితే సురక్షితంగా కిందకు దించే లోపే నియంత్రణ కోల్పోయిన హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో వేగంగా కుప్పకూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు, సైనిక రెస్క్యూ, రికవరీ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించాయి. తీవ్రమైన మంటల మధ్య శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీసే ప్రక్రియ కొనసాగుతోంది. హెలికాప్టర్ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను, సాంకేతిక లోపాన్ని అంచనా వేయడానికి ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించినట్లు పాకిస్తాన్ సైనిక మీడియా విభాగం 'ఇంటర్–సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్' ఓ ప్రకటనలో వెల్లడించింది.

## పాకిస్థాన్ కు చుక్క నీరు కూడా ఇవ్వం

### : భారత్ మరోసారి సంచలనం ప్రకటన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** భారత్– పాకిస్థాన్ మధ్య ఏళ్లుగా సాగుతున్న ఉద్రిక్తతలు గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి కారణంగా రెట్టింపయ్యాయి. గతేడాది ఏప్రిల్ 22 న జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ దాడుల వెనుక ఉన్నట్లు గ్రహించిన భారత్.. మే 7 నుంచి 10 మధ్య ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో 9 కీలక ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. వందలాదిమంది ఉగ్రవాదులను హతమార్చింది. అయితే కేవలం పాకిస్థాన్ పై దాడులే కాకుండా దౌత్య పరంగా, ఆర్థిక పరంగా అత్యంత కఠినమైన వ్యూహాత్మక నిర్ణయాలను తీసుకుంది. అయితే భారత్ తీసుకున్న నిర్ణయాల్లో 1960 నాటి సింధూ నది జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం అత్యంత ప్రధానమైనది. రక్తం.. నీరు.. కలిసి ప్రవహించలేవు అని భారత్ క్లియర్ గా స్పష్టం చేసింది. అయితే తాజాగా ఇదే వివాదంపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో పాకిస్థాన్ కు సింధూ నది వ్యవస్థ నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా ప్రధాని మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అయితే 1960 నాటి ఈ ఒప్పందం పూర్తిగా రద్దు చేయలేదని.. ప్రస్తుతం దానిని తాత్కాలిక నిలిపివేతలో ఉంచినట్లు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. సరిహద్దుల్ని దాటి పాకిస్థాన్ కు వెళ్లే నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడానికి టైమ్ బౌండ్ పద్ధతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే సంవత్సరాల్లో ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్ కు వెళ్లదని మంత్రి సీఆర్ పాటిల్ పేర్కొన్నారు. ఇక ఇదే విషయంపై తాజాగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం కింద ఏర్పాటైన ఆర్బిట్రేషన్ కోర్టు అధికార పరిధిని భారత్ తోసిపుచ్చింది. అది చట్టవిరుద్ధంగా ఏర్పడిన కోర్టు అని.. ఆ కోర్టు తీర్పులను భారత్ గుర్తించదని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్ గంగ, రాట్లే హైడ్రో పవర్ ప్రాజెక్టుల విషయంలో పాకిస్థాన్ అభ్యంతరాలను భారత్ అంగీకరించడం లేదని పేర్కొన్నారు. ఇక భారత్ తీసుకున్న నిర్ణయంతో పాకిస్థాన్ లో నీటి సంక్షోభం తలెత్తింది. ఆ దేశంలో నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పాకిస్థాన్ ఆర్థిక రాజధాని కరాచీ నగరంలో ఇప్పటికే తీవ్రమైన నీటి కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. నగరంలోని దాదాపు 70 శాతం ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఇండియన్ ఆర్మీ సంచలనం.. చైనా, పాకిస్తాన్ కు బ్యాడ్ న్యూస్..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 10 :** ప్రస్తుతం యుద్ధాల తీరు మారిపోయింది. యుద్ధంలో సాంకేతికత వినియోగం అధికం అయిపోయింది. ఇక భారత్ కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాలతో ఎప్పుడూ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంది. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఆపరేషన్ సింధూర్ లో చైనా, టర్కీ దేశాలు సరఫరా చేసిన ఆయుధాలను భారత్ పైకి ప్రయోగించింది పాకిస్థాన్. కానీ వాటిని భారత్ సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ విధంగా యుద్ధ సమయంలో పాకిస్థాన్ కు చైనా పరోక్షంగా సహకారం అందించింది. అయితే సరిహద్దు దేశాల నుంచి ముప్పు పొంచి ఉన్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు భారత రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తూ వెళ్తుంది. తాజాగా రూ. 23 వేల కోట్లతో కీలక ఒప్పందానికి శ్రీకారం చుట్టింది. పాకిస్థాన్, చైనా సరిహద్దుల వద్ద భారత సైన్యం సుదూర శ్రేణి సామర్థ్యాన్ని పెంచడం కోసం ఈ వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించారు. భారత సైన్యం కోసం అదనంగా 300 లకు పైగా కే9 వజ్ర-టీ సెల్ఫ్ ప్రొపల్డ్ ట్రాక్డ్ హౌ విట్జర్ ఫిరంగులను కొనుగోలు చేయడమే ఈ రూ. 23 వేల కోట్ల భారీ డీల్ ముఖ్య ఉద్దేశం అని సమాచారం. ఈ కీలక ప్రతిపాదనను ఈ వారంలోనే రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన డిఫెన్స్ ప్రొక్యూర్ మెంట్ బోర్డ్ ఆమోదం కోసం ఉంచనున్నారు. ఆ తర్వాత దీనిని ఫైనల్ క్లియరెన్స్ కోసం కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీకి పంపుతారు. దశాబ్దాల కాలంలో భారత సైన్యం చేపట్టబోయే అతిపెద్ద ఆర్టిలరీ ఆధునీకరణ కార్యక్రమంలో ఇది ఒకటిగా భావించవచ్చు. ఇక ఈ కాంట్రాక్ట్ ను లార్సెన్ అండ్ టూబ్రో సంస్థకు అప్పగించనున్నారు. దక్షిణ కొరియాకు చెందిన హన్వా ఏరోస్పేస్ సాంకేతిక భాగస్వామ్యంతో ఎల్ అండ్ టీ గుజరాత్ లోని హజీరా ప్లాంట్ లో ఈ క్షిపణి లాంటి ఫిరంగులను పూర్తిగా భారత్ లోనే తయారు చేయనుంది. ఇక కే9 వజ్ర ఫిరంగుల విశేషాలు చూస్తే.. వీటికి సాధారణ ఫిరంగుల మాదిరి కాకుండా ట్యాంక్ లాంటి బాడీని కలిగి ఉంటాయి. వీటిలో షూట్ అండ్ స్కూట్ సాంకేతికతను అమర్చనున్నారు. అంటే శత్రువులపై వేగంగా దాడి చేసి అవి తిరిగి దాడి చేసే లోపల సురక్షిత ప్రాంతాలకు చేరుకోగలవు. ఇవి 40 కిలోమీటర్ల దూరంలో కంటే ఎక్కువ దూరంలో ఉన్న శత్రు స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో దాడులు చేయగలవు.

# రామ్ చరణ్ 'పెద్ది' వివాదంపై
# అదా శర్మ కామెంట్స్

**'పెద్ది' సినిమాలో జాన్వీ పాత్రపై ట్రోలింగ్**
**తాను ఆ సినిమా చూడలేదన్న అదా శర్మ**
**ప్రాజెక్టులు ఎంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హితవు**

'ది కేరళ స్టోరీ'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అదా శర్మ త్వరలోనే 'గవర్నర్' అనే పవర్‌ఫుల్ చిత్రంతో మన ముందుకు రాబోతున్నారు. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో, చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ థ్రిల్లర్, 1990ల నాటి భారత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తెరకెక్కింది. ఆర్బీఐ గవర్నర్ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి ఎలా రక్షించారనే యథార్థ సంఘటనల ఆధారంగా విపుల్ షా నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న విడుదల కానుంది.ఈ చిత్రం ప్రమోషన్లలో భాగంగా అదా శర్మ.. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో జాన్వీ కపూర్ పాత్రపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఆసక్తికరంగా స్పందించారు. 'పెద్ది' సినిమాలో మహిళలను అభ్యంతరకరంగా చూపించారనే విమర్శలతో దర్శకుడు బుచ్చిబాబు సనా ఇప్పటికే క్షమాపణలు చెప్పి ఆ సీన్లను తొలగించిన సంగతి తెలిసిందే.దీనిపై అదా మాట్లాడుతూ.. తాను ఆ సినిమాలో నటించలేదని, ఇంకా చూడలేదని చెబుతూనే, ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేని తన ప్రయాణం వేరని, కాబట్టి ఆ వివాదంపై మాట్లాడటం సరైంది కాదని చాకచక్యంగా తప్పించుకున్నారు. అయితే, నటీనటులు, దర్శకులు, రచయితలు ప్రాజెక్ట్‌లను ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, మన చిన్న తప్పుడు నిర్ణయం సమాజంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మహిళలకు భిన్నమైన కోణాలు ఉన్న స్క్రిప్టులనే తాను ఇష్టపడతానని ఆమె స్పష్టం చేశారు.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.